క్లుప్తంగా

స్థానిక సమస్యలపై కలెక్టర్ ఆరా



38వ డివిజన్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (టూటౌన్): స్థానిక 37, 38 డివిజన్లలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాంతాల్లో స్థానిక సమస్యలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం ఆర్‌ఆర్ పేట, గుబ్బలవారి వీధుల్లో పర్యటించిన కలెక్టర్ ప్రజలతోనేరుగా మాట్లాడారు. మంచినీటి సదుపాయం, డ్రెయిన్ల నిర్వహణ, కార్పొరేషన్ నుంచి రోజు చెత్త సేకరణ తదితర అంశాలపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, తహసీల్దారు గాయత్రి, ప్రజాప్రతినిధులు నాయుడు సోము, ఈతకోట శ్రీనివాసరావు, ఎస్ దుర్గాప్రసాద్, తదితరులు ఉన్నారు.

క్రిస్టియన్ నన్‌లను విడుదల చేయాలి



పెరికే వరప్రసాదరావు

ఏలూరు (టూటౌన్): ఛత్తీస్‌గఢ్ జైల్లో ఉన్న క్రిస్టియన్ నన్‌లను తక్షణమే విడుదల చేయాలి నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వర ప్రసాదరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో మానవ అక్రమ రవాణా, బలవంతపు మత మార్పిడి ఆరోపణలపై కాథలిక్ నన్‌లను అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధమే అన్నారు. వారిని వెంటనే విడుద చేయాలని కోరారు. ఏళ్ల తరబడి పేదలకు సేవ చేస్తోన్న నన్‌ను కక్షసాధింపు చర్యల్లో భాగంగానే బీజేపీ సర్కార్ జైలుకు పంపిందని ఆరోపించారు

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



పత్తేబాద శ్రీ కనకదుర్గమ్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు, అమ్మవార్లకు విశేష అలంకరణలు చేశారు. అనంతరం లలితాసహస్రనామ పారాయణలు, మణిద్వీప వర్ణన పారాయణాలు నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

ఏలూరు రైల్వే స్టేషన్‌కు మహర్దశ

- అమృత్ స్టేషన్ అభివృద్ధి పథకంలో చకచకా పనులు
- రూ.21.10 కోట్ల నిధులు కేటాయింపు
- ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తి
- ప్రయాణికుల హర్షం



స్టేషన్‌లో కొత్తగా నిర్మించిన ప్లాట్ ఫాం, షెడ్లు



రైల్వే స్టేషన్ లోపల కూర్చునేందుకు ఏర్పాటు చేసిన స్టీల్ చైర్లు

ఏలూరు (టూటౌన్): దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో ఒక్కటైన ఏలూరు రైల్వేస్టేషన్ కొత్త హంగులను సంతరించుకుంటోంది. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో ఏడాది క్రితం ఎంపికయిన ఏలూరు స్టేషన్ అభివృద్ధికి రూ.21.10 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో చేపట్టిన పనులు చకచకా సాగిపోతున్నాయి. వెయిటింగ్ హాల్, ఏసీ వెయిటింగ్ హాల్, వెస్ట్రన్ స్టైల్లో బాత్ రూమ్‌లు, వాష్ బేసిన్లు తదితర సౌకర్యాలు కల్పించారు. ప్లాట్ ఫారంపై అదనపు షెడ్ నిర్మాణంతోపాటు ఫ్లోరింగ్‌ను టైల్స్‌తో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఈ స్టేషన్ మీదుగా నిత్యం 61 రైలు సర్వీసులు నడుస్తున్నాయి. అడపాదడపా ప్రత్యేక రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. రోజుకు ఆరు వేల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు చేస్తున్నారు.

ముఖ్య పట్టణాల్లో ఒకటి

రాష్ట్రంలోని ముఖ్యమైన పట్టణాల్లో ఏలూరు ఒకటి. కొత్త జిల్లాకు కేంద్రంగా ఉన్న ఏలూరు పేరు చెబితేనే గుర్తుకు వచ్చేది తివాచీ పరిశ్రమ. ఏలూరుకు ఇటు భౌగోళికంగా, అటు చారిత్రాత్మకంగా, వివిధ రంగాల్లో గుర్తింపు ఉంది. ఆక్వా పరిశ్రమ అభివృద్ధి చెందుతుండటంతో ఏలూరు రైల్వేస్టేషన్ నుంచి ఎగుమతులకు వెసులుబాటు కలుగనుంది. ఇప్పటికే ఏలూరు రైల్వే స్టేసన్ నుంచి ప్రతి నెలా పెద్ద ఎత్తున ఎఫ్‌సీఐ ద్వారా బియ్యం ఎగుమతులు కొనసాగుతున్నాయి.

ఉత్తమ శ్రేణి స్టేషన్‌గా రూపాంతరం

దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా ఈ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారంతో పాటు ప్రాంగణం, ట్రాఫిక్ వసతులు, వెయిటింగ్ గదులు, ప్రయాణికులకు అనువుగా ఉండే సమాచార సూచికలు వృద్ధి చేయనున్నారు. రైల్వే స్టేషన్ల సదుపాయాల పరంగా నూతనత్వంతో ఉత్తమ శ్రేణి రైల్వే స్టేషన్‌గా ఏలూరు స్టేషన్ రూపాంతరం చెందనుంది.

ప్రయాణికుల హర్షం

ఏలూరు స్టేషన్ భౌగోళికంగా ఇటు మెట్ట, అటు డెల్టా ప్రాంతాలకు కీలక కేంద్రంగా ఉంది. ఆక్వా, వరి, ఉద్యాన, వాణిజ్య పంటల ఎగుమతులు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇంతటి కీలకమైన స్టేషన్‌ను అభివృద్ధి చేయనుండటం పట్ల ఈ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వందే భారత్ లాంటి రైళ్లను, విశాఖపట్టణం నుంచి వచ్చే రైలుకు హాల్టు ఇచ్చారు. కాని, హైదరాబాద్ నుంచి వచ్చే సర్వీస్‌కు ఏలూరులో హాల్ట్ ఇవ్వక పోవడం, ఒక రైలు రెండు సర్వీసులకు హాల్టు ఇవ్వకుండా కేవలం ఒక్క సర్వీస్‌కే హాల్టు ఇవ్వడం వల్ల ఏలూరు కేంద్రంగా రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.





నూతన వెయిటింగ్ హాల్ భవనం, వెయిటింగ్ హాల్‌లో ఉన్న వెస్ట్రన్ టాయిలెట్స్, వాష్ బేసిన్ తదితరాలు



ఏలూరు రైల్వే స్టేషన్ మెయిన్ ఎంట్రన్స్ (ఫైల్)

మరింత ప్రయోజనం



అమృత్ భారత్ స్టేషన్ పథకంలో ఏలూరు రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక ప్రజలు, వ్యాపారులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. ఇటు ప్రయాణికులకు ప్రయోజనంతో పాటు అటు రైల్వే శాఖకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. నిధులు కేటాయించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు.

– నాగం శివ, మాజీ డీయూఆర్‌సీసీ సభ్యుడు, ఏలూరు

మారిపోతున్న రూపురేఖలు



ఏలూరు స్టేషన్‌లో రూ.21.10 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు చాలా వరకు పూర్తయ్యాయి. స్టేషన్ ముఖద్వారం, ప్లాట్ ఫారంలకు సంబంధించి సాంకేతిక సిబ్బంది, అధికారులు సర్వే చేశారు. ప్రయాణికులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా రైల్వే శాఖ చర్యలు తీసుకుంది. అభివృద్ధి పనులు మొత్తం పూర్తయితే ఏలూరు స్టేషన్ రూపు రేఖలు మారిపోనున్నాయి.

– ఎస్‌వీ రమేష్, రైల్వే స్టేషన్ మేనేజర్, ఏలూరు

తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యానికి భరోసా



చోడిదిబ్బ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శారద

ఏలూరు (టూటౌన్): తల్లిపాలు పిల్లల ఆరోగ్య భవితకు బలమైన పునాది అని ఐసీడీఎస్ పీడీ పి.శారద అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక చోడిదిబ్బ పెద్దింటి వారి వీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి పీడీ శారద మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డ హక్కు – తొలి టీకా, జీవితానికి కవచం అని వివరించారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డకే కాదు తల్లికి కూడా శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా రక్షణ లభిస్తుందని తెలిపారు. సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంత ముఖ్యమో తల్లికి కూడా అంతే లాభమని తెలిపారు. ఆస్పత్రులు, రైల్వే స్టేషన్, బస్‌స్టాండ్లలో ఉన్న ఫీడింగ్ రూమ్స్‌ను తల్లులు ఉపయోగించుకోవాలని సూచించారు. యూపీహెచ్‌సీ డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ తల్లిబిడ్డకు రెండేళ్ల వరకు పాలు ఇవ్వాలని సూచించారు. సూపర్‌వైజర్ మానిక మాట్లాడుతూ తల్లి, బిడ్డకు పాలు ఇచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఎన్‌ఎం నాగమణి ముర్రుపాలు ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.నాగదేవి, డీఎస్‌డీ భవాని, ఆశావర్కర్లు, హెల్పర్‌లు పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణ తరగతుల పోస్టర్ విడుదల



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 4, 5, 6 తేదీల్లో నంద్యాలలో నిర్వహించే పీడీఎస్‌యూ రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతుల వాల్ పోస్టర్‌ను ఏలూరు డిగ్రీ కళాశాలలో శుక్రవారం పీడీఎస్‌యూ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ నాలుగో తేదీన 3వేల మందితో ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. 5, 6 తేదీల్లో రాజకీయ శిక్షణ ఉంటుందని వివరించారు. ఈ తరగతులకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి దాదాపు 50 మంది విద్యార్థులు హాజరౌతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి శాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రహింసలకు గురిచేశారంటూ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): అకారణంగా కట్టేసి కొట్టి చిత్రహింసలకు గురిచేసిన వ్యక్తులను అరెస్ట్ చేశాలని, తలారి ప్రకాష్‌పై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తలారి ప్రకాష్‌పై ఇటీవల రైస్ మిల్లు స్థలం విషయంలో అకారణంగా దాడి చేసి, తాళ్లతో బంధించి చిత్రహింసలకు గురి చేశారని తెలిపారు. బాధితుడు ప్రకాష్ మాట్లాడుతూ కామవరపుకోట మండలం జోగడగూడెంలో తాను నివాసం ఉంటూ పదేళ్ల నుంచి రైస్ మిల్లు స్థలం లీజుకు తీసుకొని సిమెంట్ తూరలు తయారు చేస్తున్నానని తెలిపారు. తన స్థలంలో కొందరు ఆకతాయిలు గంజాయి మద్యం సేవిస్తున్నారని, దీంతో స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేస్తుండగా అదే గ్రామానికి చెందిన 12 మంది అకారణంగా దాడి చేసి కొట్టారని వివరించారు. కులం పేరుతో దూషించారని తెలిపారు. తనపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పీడీఎస్‌యూ జంగారెడ్డిగూడెం నాయకులు మామిడి రూపశంకర్, పి.రమేష్, జి.సత్యనారాయణ, అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ప్రజలకు అవగాహన కలిగిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ అమృతం

ఏలూరు (టూటౌన్) : పరిసరాల పరిశుభ్రత ద్వారా వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పీజే అమృతం అన్నారు. స్థానిక గజ్జల వారి చెరువు పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న తోటకూర దొడ్లు 1, 2, 3 సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ఆమె శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అపరిశుభ్ర పరిసరాల వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్, కామెర్లు, నీళ్ల విరోచనాలు వంటి వ్యాధులు సంభవించే అవకాశం ఉందని ప్రజలకు వివరించారు. పరిసరాల పరిశుభ్రత ప్రజల సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపైనా, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించి, వారిలో మార్పు తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ గజ్జల వారి చెరువు వైద్యాధికారి బాలకృష్ణ అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ సీసీ బి.బసవరాజు, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, మేల్ హెల్త్ అసిస్టెంట్స్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలలు కావస్తున్నా నేటికీ జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఏపీటీఎఫ్ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన సంఘ ఏలూరు నగర శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కూడా సర్‌ప్లస్‌లో ఉన్న ఉపాధ్యాయులను డీఈఓ పూల్ లేదా కమిషనర్ పూల్‌లో ఉంచినప్పటికీ కూడా ఒక్కరోజు కూడా ఉపాధ్యాయులకు జీతాలు ఆలస్యం కాలేదని గుర్తుచేశారు. జీతాల సమస్యతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులకు వెంటనే చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. సంఘ నగర అధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ క్వార్టర్స్, ఎస్పీ కార్యాలయం, పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ప్రాంతం, అమీనా పేట ఏటిగట్టు, సీఎస్ఐ చర్చి వెనుక, కలెక్టర్ కార్యాలయం వెనుక ఏటిగట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మహిళా భద్రతపై అవగాహన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శక్తి బృందం శుక్రవారం స్థానిక శ్రీ కృష్ణదేవరాయ జూనియర్ కాలేజీ, పాఠశాలలో బర్ క్రైమ్, ఫోక్సో, ఈవ్ టీజింగ్, మహిళా భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఒక విద్యార్థిని తన నివాస ప్రాంతంలో ఒక వ్యక్తి అసభ్యకర వీడియోలు చూపిస్తున్నాడని చెప్పగా, వెంటనే ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావుకు తెలిపారు. సదరు వ్యక్తిని గుర్తించి, ప్రాథమిక విచారణ చేపట్టి, విచారణ అనంతరం, సదరు వ్యక్తిని మండల రెవెన్యూ అధికారి సమక్షంలో బైండోవర్ చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	26	బీన్లచిక్కుడు	140
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	36	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	66	కంద	00
కాకర కాయలు	38	బీట్‌రూట్	40
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	46	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	26	అల్లం	86
క్యారెట్	40–45	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	26	పుదీనా	05
ఆనబకాయ (1)	20–30	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	16
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	08
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	24
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	24
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు – తిరుపతి	16.00	4830	29

పింఛన్ కోసం పడిగాపులు



చేపల తూము సెంటరులో సచివాలయం వద్ద ఎదురుచూపు



పింఛన్ ఇచ్చేవారు వచ్చారా ?



41 డివిజన్ సచివాలయం వద్ద పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు



చొదిమెళ్ల సచివాలయంలో పింఛన్ ఇస్తున్న సిబ్బంది

గతంలో అయితే సూర్యుడి ముఖం చూడకుండానే చేతిలో పింఛన్ డబ్బులు వచ్చేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎప్పుడు వస్తారని గుమ్మంలో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంతకి... అంతకి రాకపోవడంతో కొన్నిచోట్ల సచివాలయాల్లో పింఛన్లు ఇవ్వడం, ఇంకోచోట అయితే సమాధానం చెప్పేవాళ్లే లేకుండా సచివాలయానికి తాళం వేసి ఉండటంతో బయటే నిరీక్షించడం, మెట్లపై కాపలాకాయడం కనిపించాయి. శుక్రవారం ఏలూరు నగరంలో పింఛన్ లబ్ధిదారులు పడిన కష్టాల చిత్రాల్లో కొన్ని ఇవి.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



పింఛన్ కోసం గుమ్మంలో వృద్ధురాలి పడిగాపులు

కళా రంగానికి సేవలందించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ పొందినా కళాకారునిగా కళారంగానికి పూర్తి స్థాయిలో సేవలందించాలని పలువురు వక్తలు ఎండీ ఖాజావలీని కోరారు. స్టేట్ ఆడిట్ శాఖలో ఆడిటర్‌గా పని చేస్తూ గత నెల 31న పదవీ విరమణ చేసిన ఖాజా వలీ పదవీ విరమణ అభినందన సభ శుక్రవారం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాల్‌లో నిర్వహించారు. జిల్లా పౌర సంబంధాధికారి రామచంద్రరావు, నగరానికి చెందిన వివిధ కళా సంస్థల ప్రతినిధులు గరికపాటి కాళిదాసు, పుల్లాభొట్ల పురుషోత్తమ రావు, పెదపాటి రామకృష్ణ, గురు శర్మ, తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాక్షేత్రం అధినేత బీవీ రామారావు, ఆలపాటి నాగేశ్వర రావు, తెలుగు చరయితల సంఘం ప్రతినిధులు, లంకా వెంకటేశ్వర్లు, నాగాస్త్రి, లేళ్ల వెంకటేశ్వర రావు, దువ్వి రామారావు, డి.హేమసుందర్, మజ్జి సూర్య కాంతారావు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ

భీమడోలు: భీమడోలులో ఈ నెల 2వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి తెలిపారు. భీమడోలులోని వీసీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.